




నెలనెలా ఒక జ్ఞాపకం ‘కళాప్రపూర్ణ‘ డాక్టర్ అవసరాల(వింజమూరి)అనసూయాదేవి

# నేనెరిగిన గాయనీ గాయకులు -1

మా ఊరు కాకినాడ. మా ఊళ్ళోని ‘సరస్వతీ గాన సభ‘ ఆంధ్రాలో ప్రప్రథంగా స్థాపించిన గాన సభల్లో ఒకటి. ఆరోజుల్లో, అనగా 80 సంవత్సరాల క్రిందట, కన్యాకుమారి మొదలు కాశ్మీర్ వరకూ ఉండే ఉత్తర, దక్షిణ దేశపు కళాకారులందరూ కాకినాడకు విచ్చేసి, సరస్వతీ గాన సభలో, వారి వారి పాండిత్య ప్రదర్శనలిచ్చేవారు. అప్పటి రోజుల్లో, ఆ సభలో కచేరీ చేయడం అనేది ప్రతిష్టాత్మకమైన పెద్దగౌరవంగా భావించేవారు.

ప్రసిద్ధికెక్కిన గాయకుల్ని, కళాకారుల్నీ వినే, చూసే అదృష్టం నాకు చిన్న తనంలోనే లభించింది. సంగమేశ్వర శాస్త్రిగారి వీణ, ద్వారం వెంకటస్వామి నాయుడుగారి వయొలిన్, వేమన దొరగారి వయొలిన్, ఆదిభట్ల నారాయణ దాసు హరికథ, ధనమ్మాళ్ వీణ, బెంగుళూరు నాగరత్నమ్మ వీణ, బాలసరస్వతి, బాలచంద్రల భరతనాట్యం, పాలఘాట్ కొచ్చమ్మాళ్, మహారాజపురం విశ్వనాధనాయర్, అరియకుడి రామానుజయ్యంగారు, చిత్తూరు సుబ్రహ్మణ్య పిళ్ళై, ముసిరిసుబ్రహ్మణ్యయ్యర్ , జి.ఎన్.బాలసుబ్రమణ్యం, బి. రాజయ్యంగారు, మైసూరు మహేంద్రప్ప, హోనప్ప భాగవతార్, డి.కె. పట్టమ్మాళ్, (కొన్ని కచేరీలు డి.కె రామనాథ్ ని కలుపుకుని పాడేవారు), లలితాంగి (M.L. వసంతకుమారి తల్లి. చిన్న పిల్లగా ఉన్నపుడే M.L.V తల్లితో కలిసి పాడేది), Nc వసంత కోకిలమ్, M.S.సుబ్బలక్ష్మి, మహాలింగం ఫ్లూట్, నారాయణయ్యంగారి గోట్ట్ వాయిద్యం, దొరసామి అయ్యర్ వీణ; వినే అదృష్టం నాకు కలిగింది.

దక్షిణాది గాయకులేగాక, ప్రసిద్ధి కెక్కిన హిందూస్తానీ సంగీత విద్వాంసులు కూడా మా ఊరికి వచ్చేవారు. వారిలో కొన్ని పేర్లు మాత్రమే జ్ఞాపకం ఉన్నాయి. గంగూబాయి హంగల్, కాశీబాయ్ (బనారస్), బాల గంధర్వ, నారాయణరాలేవ్యాస్, మన్హర్ బల్వే, (ఈయన వివిధ రకాల వాద్యాలను కూడా వాయించేవారు), పద్మావతిసాలిగ్రాం, మొదలుగువారు. అలనాడు నే విన్న గాయనీ గాయకుల్ని గురించి జ్ఞాపకమున్న విషయాలు క్లుప్తంగా వ్రాస్తాను.

(1) సంగమేశ్వర శాస్త్రి గారు -వీణ వాద్యం:- మామయ్య కృష్ణశాస్త్రి ఉండే పిఠాపురం, ఈ శాస్త్రి గారి నివాసము కూడాను. వీరిని గురించి కథలు చెప్పుకున్నవే ఎక్కువ విన్నాను, కచేరీలకంటే. ఆరోజుల్లో అమాయకత్వమో 'ఏంబిషన్ లేకపోవడమో, పేరు, ప్రతిష్ఠల కోసం తాపత్రయ పడకపోవడమో తెలియదు కాని, వీరికున్న పాండిత్యాన్నికి. ప్రతిభకీ, క్రియేటివిటీకీ సరిపడ్డ పేరు వచ్చినట్టు లేదు. వీరి కుమారుడు, తండ్రి వద్ద విద్య పూర్తిగా నేర్వకపోయినా, అద్భుతంగా వాయించేవాడట- " తానం వాయిస్తున్నట్టు పరుగెత్తుకు వచ్చాను", అనీ, ఎవరేనా చనిపోతే, "వాడు పతమానసుతుడు పట్టాడు" అనేవాడట. అంటే జీవితానికి మంగళం పాడాడని అతని అభిప్రాయమై ఉంటుంది. ఇవి వీరి కుటుంబాన్ని గురించి నేను విన్న విషయాలు నాకు జ్ఞాపకమున్న మొదటి కచేరి, నా 5వ ఏట విన్న సంగమేశ్వర శాస్త్రిగారి వీణవాద్యం. ఇది 80 ఏళ్ళ క్రిందటి మాట. అప్పటి రోజుల్లో, సరస్వతీ గానసభ వారి కచేరీలు, కొన్నాళ్ళు '"ఆంధ్ర సేవా సంఘం" నాటక కంపెనీ వారి హాల్లో జరిగేవి. తరువాత, అన్నదాన సమాజం హాల్లోకి మార్చారు. సంగమేశ్వర శాస్త్రి గారి వీణ వాద్యం ఆంధ్ర సేవాసంఘంలో జరిగింది. ఆ రోజుల్లో మైక్కు, కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు. అందరూ చాపల మీద కూర్చునే వినే వారు. శాస్త్రి గారు వీణను, సర్వసాధారణంగా అందరూ వాయించే విధానంలో, వాయించే వారు కారు. సరస్వతీ దేవి ఫోజ్‌లో కూడా కాదు. బాసిం పెట్టు పెట్టుకుని కూర్చుని, వీణ తలను ఒడిలో పెట్టుకుని, వీణను నిటారుగా నిలబెట్టి వాయించారు. నా ఆశ్చర్యానికి మేరలేదు. అలా వాయించడం చూడటం అదే మొదటిసారి.

సంగమేశ్వర శాస్త్రిగారి కచేరీ పూర్తిగా, ఆయన కెదురుగా 5 గజాల దూరంలో, ఆంధ్ర సేవాసంఘం స్థాపకుల్లో ఒకరు, పేరెక్కిన నటులు, మా నాన్న గారి మిత్రులు కృష్ణమూర్తిగారి ఒళ్ళో కూర్చుని విన్నాను. (ఈయన, ప్రఖ్యాత ప్లేబాక్ సింగర్ పి.బి.శ్రీనివాస్ మేనమామ. మా నాన్నగారు వ్రాసిన 'అనార్కలీ నాటకంలో అక్బర్ పాత్ర ధరించేవారు). సంగమేశ్వర శాస్త్రిగారి కచేరీ పూర్తయాక, మా నాన్నగారు నన్ను తీసుకు వెళ్ళి ఆయన కాళ్ళకు నమస్కారం పెట్టించారు. ఆయన మాట్లాడకుండా చేతులతో దీవించారు. నేనే శాస్త్రిగారి నడిగాను "మీరు ఒక్క వీణే వాయించారు కదా, ఎన్నో వీణలు వాయించినట్టు నాదం ఎలా వచ్చింది?" అన్నాను. కృష్ణమాచారిగారు " మనం పెద్ద వాళ్ళం చెప్పలేని మాట మీ అమ్మాయి ఎంత బాగా అందో విన్నారా?" అన్నారు మానాన్నగారితో.

అలనాడు, త్యాగరాజంతటివాడు, వెస్టరన్ మ్యూజిక్ వల్ల ప్రభావితుడై, "శర శర సమరైక శూర", "రఘువంశ సుధాంబుధి చంద్రమా", లాంటి కీర్తనలు వ్రాశాడని అంటారు. మొదటి ప్రపంచ యుద్ధం నాటి వాడైన సంగమేశ్వర శాస్త్రిగారి మీద కూడా, బ్రిటిష్ ఇండియా లోని పాశ్చాత్య సంగీత ప్రభావం పడి, సింఫనీ లాగా వాయించారేమో! ఇది నేను విన్న మొదటి కచేరీ, మనస్సుకు హత్తుకు పోయిన మొదటి అనుభవం.

(2) వేమన దొరగారు- వయొలిన్ వాద్యం:- సంగమేశ్వర సాస్త్రిగారి వీణ విన్నాక, తర్వాత విన్నది మరో

విద్వాంసుడు వేమన దొరగారి వయొలిన్. అది కూడా ఏ సభలోనూ కాదు, వారిట్లోనే పిఠాపురంలో. పిఠాపురం గొప్ప గొప్ప కళాకారుల పుట్టినిల్లు.

వేమన దొరగారు వెలమ దొరలు. పండుతమలపాకు రంగులో, బక్కగా, పీలగా ఉండేవారు. సంగమేశ్వర శాస్త్రిగారి లాగే వీరూ ఒక జీనియస్ . వీరి వయొలిన్ వాద్యం కొత్తరకంగా వినపడేది. చెప్పలేని మధుర నాదం. అది వయొలినా, మరేదైనా కొత్త వాద్యమా అనిపించేది. అయితే, ఈయన వయొలిన్ వాయిస్తుంటే విన్న వారు బహు కొద్దిమంది. అది కూడా, ఆయనకి కనపడకుండా, దొంగ చాటుగా విన్నవారే. వర్ణం మొదలు, రాగం తానం పల్లవి, మంగళం వరకూ పూర్తి కచేరీ, హాయిగా ఆ వాయిద్యంలో లీనమై, ఎక్టసీస్ వెళ్ళి, అనుభవిస్తూ, ఆనందిస్తూ, ఒక్కరూ తమ గదిలో కూర్చుని వాయించుకునేవారట. విన్న వారిలో చాలా మంది అటువంటి కచేరీలే విన్నారు. కర్మం జాలక, ఎవరైనా ఆయన కంటబడ్డారో, కంగారు పడి చేతులు వణికి వాయించలేక పోయేవారని చెప్పుకుంటారు.

వేమన దొరగారిల్లు, మామయ్య కృష్ణశా స్త్రి ఇంటికి ఫర్లాంగు దూరంలో ఉంది. మా నాన్నగారు, ఈయన కలిసి చిన్నప్పుడు చదువుకున్నారట. ఓ రోజు నాన్నగారు, నన్ను వేమన దొరగారింటికి తీసుకెళ్ళారు, నా పాట వారికి వినిపించడానికీ, ఆయన " మూడ్ " లో ఉంటే ఒక కీర్తన నాకు నేర్పించడానికీ. వారిల్లు సమీపిస్తుంటేనే, అతి మధురమైన నాదంతో, "ఎవరని నిర్ణయించేదిరా" కీర్తనలో "శివుడవో! మాధవుడవో!" తారాస్థాయిలో త్రిల్లింగ్ గా వినపడుతోంది. అప్పటికే ఇంటిముందు రోడ్ మీద గుమికూడి, నిలబడి వింటున్న జనం, " ఆహా ఓహో!" అంటూ వింటున్నారు. నాన్నగారు, అన్నయ్య, నేనూ, కొంచెం సేపు బయట నిలబడి విని, లోపలకు వెళ్ళాం. మమ్మల్ని చూసీ చూడటంతో, వయొలిన్ క్రింద పెట్టేసి, "రా నరసింహారావు - రా", అన్నారు. మా నాన్నగారు "అయ్యో ఆపకండి, వాయించండి. మీవాయిద్యం వినిపించాలనే మా అమ్మాయిని తీసుకుని వచ్చాను" అన్నారు. దొరగారు "నాయనా! వాయిద్యం మానేసి చాలా రోజులైందయ్యా. ఇపుడు ఊరికినే శృతులు వింటున్నాను" అన్నారు. ఎందరో సభల వాళ్ళు, హేమాహేమీలు ఈయన్ని తీసుకెళ్ళి కచేరీ చేయించాలని ప్రయత్నించి, సాధ్యంకాక విరమించుకున్నారు. 75 ఏళ్ళ క్రిందట రోడ్ మీద నిలబడి విన్న "శివుడో మాధవుడో", ఎన్నాళ్ళో నా చెవులలో వినపడుతున్నట్టుండేది. ఇది మరచిపోలేని సంఘటన, మరచిపోలేని మధుర సంగీతం. యహూడిమేన్ హిన్, క్రైస్లర్లకి తీసిపోని వాయిద్యం వేమన దొరగారిది. వెలమ దొర, వేమనదొర, వయొలిన్ దొర, A rare person and a great violinist.

(3) ఆదిభట్ల నారాయణదాసు-హరికథ విద్వాంసులు:- వీరిని హరికథా పితామహుడంటారు. నా చిన్నతనంలో చూసిన, విన్న, ఈయన హరికథ మరుపురానిది. ఈయన హరికథతో, సంగీతం, నాట్యం, నాటకం మిళితమై ఉండేవి. దాసుగారు స్థూలకాయుడైనా మంచి స్ఫురద్రూపి. భావాన్ని వ్యక్తీకరించే పెద్ద కళ్ళూ, ముఖమూ, పొడగు జుట్టూ, బొజ్జా, చేతికి సింహతలాటాలు, కాలికి గండపెండేరంతో కావి రంగు జరీ పట్టుపంచతో, పసుపురంగు పట్టుకండువాతో నడుం

బిగించి,కాళ్ళకు గజ్జలతో  నారాయణ దాసు  గారు వేదిక మీదకు రాగానే, వాతావరణమే మారిపోయి, మరోలోకంలో ఉన్నట్టుండేది. అప్పటికే 50 ఏళ్ళ పై వయస్సులో ఉన్న ఆయన, మంచి నడివయస్సులో ఉన్న యువకుడిలాగ ఎగురుతూ, గెంతుతూ, ఆడుతూ, పాడుతూ చెప్పిన రుక్మిణీ కల్యాణం హరికథ, ఇంకా నా కళ్ళలో కట్టినట్టుంది.

నారాయణదాసుగారిది గభీరమైన శరీరం, శారీరం కూడాను. వీరు గొప్ప గాయకులు, గొప్ప నటులు, గొప్ప నాట్యప్రవీణులూ కూడాను. "రుక్మిణీ కల్యాణం" హరికథ చెపుతూ, రుక్మిణి ఎంత సొగసుగా, అందంగా, సుందరంగా, మనోహరంగా నడచిందో, వయ్యారం ఒలకపోస్తూ, ఆడవాళ్ళకంటే వయ్యారంగా నడచి చూపించేవారు. వీరు మంచి లయ బ్రహ్మ. జతులూ, గతులూ, అభినయంతో కూడుకున్న ఈయన హరికథ సాటిలేనిది, మరవలేనిది.



